Sakshi    Dt- 29/06/15

# ‘మెట్రో’కు నయాలుక్

- మెట్రోదారుల్లో ‘ల్యాండ్ స్కేప్’ అందాలు
- మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఉప్పల్ : హరివిల్లును తలపించే రంగురంగుల పూల మొక్కలు.. ఆహ్లాదాన్ని పంచే పచ్చిక బయళ్లు..తీరైన క్రోటన్ మొక్కలు, ల్యాండ్ స్కేపింగ్‌తో మెట్రో కారిడార్లు నయాలుక్ సంతరించుకోనున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హెచ్‌ఎంఆర్ అధికారులతో కలసి ఉప్పల్ మెట్రో స్టేషన్ పరిసరాల్లో హెచ్‌ఎంఆర్ సంస్థ చేపట్టిన ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని మెట్రో స్టేషన్లలో ల్యాండ్ స్కేప్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. యువ, ఔత్సాహిక చిత్రకారులను ప్రోత్సహించేందుకు స్టేషన్ల కింద తీరైన ఫ్లోరింగ్‌తో పాటు పక్కన ఉండే గోడలపై చారిత్రక కట్టడాలు గోల్కొండ, చార్మినార్ చిత్రాలను పెయింటింగ్ చేయిస్తున్నామన్నారు. మెట్రో స్టేషన్ల కింద ఫ్లోరింగ్‌తో ప్రత్యేక ఆకర్షణీయమైన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడంతోపాటు ప్రయాణీకులు కొద్ది సేపు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. ల్యాండ్‌స్కేపింగ్‌తో మెట్రో స్టేషన్ల పరిసరాలు పూర్తిగా హరిత వాతావరణం సంతరించుకొని...అలసిసొలసిన ప్రయాణీకులకు స్వచ్ఛమైన ఆక్సీజన్‌ను అందించి సేదదీరేందుకు ఉపకరిస్తాయన్నారు. ల్యాండ్ స్కేపింగ్‌లో వివిధ రకాల పూల మొక్కలు,అలంకరణ మొక్కలు, బోన్సాయ్‌లు,క్రోటన్ మొక్కలు కనువిందు చేస్తాయన్నారు. నగరంలో ఏర్పాటు కానున్న 65 మెట్రో స్టేషన్లను ప్రత్యేక డిజైన్‌తో అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## చిన్నారులకు ఆటాపాటా..

మెట్రో స్టేషన్ల సమీపంలో ఏర్పాటుకానున్న ల్యాండ్‌స్కేప్‌గార్డెన్‌లో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వృద్ధులకు ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు ప్రణాళికాబద్ధమైన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి అందులో కార్లు,ద్విచక్రవాహనాలు,సైకిళ్లను పార్క్ చేసేందుకు వసతులు కల్పిస్తున్నామన్నారు.


పనులను పరిశీలిస్తున్న హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

## ప్రతిస్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ప్రతి స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తప్పనిసరిగా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే హాకర్స్, టీ స్టాల్స్ క్యాంటీన్‌లకు ప్రత్యేక స్థలాలు కేటాయించి పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి స్టేషన్‌లో వసతుల కల్పన, పరిశుభ్రత ఏర్పాట్లకు రూ.60 కోట్లు, కంబైన్డ్ స్టేషన్‌లో అయితే రూ.120 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జనరల్ మేనేజర్ వర్క్స్ రాజేశ్వర్, ఈఈ శ్రీలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.